క్లుప్తంగా

కనులపండువగా రాములోరి కల్యాణం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఎల్లమ్మబండ శిల్పాబృందావనంలోని కోదండరామస్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు అందించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. రథోత్సవాన్ని పురవీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శిల్పాబృందావనం, కాలనీవాసులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మి



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా సౌందర్య, పుట్టం దేవి, జనరల్ సెక్రటరీలుగా నాగలక్ష్మి, సుజాత, జాయింట్ సెక్రటరీలుగా దారుపల్లి లక్ష్మి, బండారు మణెమ్మ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ఎమ్మెల్యే గాంధీ, వెంకటేశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటివద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కూకట్‌పల్లి డీఎం హరి

మూసాపేట: భద్రాద్రి రాములోరి తలంబ్రాలను ఇంటివద్దకే డెలివరీ చేస్తామని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ హరి తెలిపారు. కూకట్‌పల్లిలోని డిపోలో భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల పంపిణీ పోస్టర్‌ను అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి సీతారాముల కల్యాణం చూడలేకపోయినా తలంబ్రాలను పొందే అవకాశం ఆర్టీసీ కల్పిస్తుందన్నారు. ఒక్కో తలంబ్రాల ప్యాకెట్ ధర. 151 అని, అందులో 2 ముత్యాలు కూడా ఉంటాయన్నారు. 9154298824లో సంప్రదించి బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య, సీనియర్ అసిస్టెంట్ ఫైనాన్స్ కె.సరిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

కూకట్‌పల్లి : జేఎన్టీయూ ఆడిటోరియంలో హలో హైదరాబాద్ క్రీడా సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధికి కృషి చేసిన పలువురు మహిళలను సోమవారం సన్మానించారు. వారాహి క్రియేషన్స్ సంస్థ తరపున బాలాజీనగర్‌లో మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి, వారికి జీవనోపాధి కల్పిస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకురాలు కుమారి కోట లావణ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపు కోసం, ప్రచారం కోసమో సేవా కార్యక్రమం నిర్వహించలేదని, మహిళల్లో ఆత్మస్థైర్యం నింపి వారి అభ్యున్నతికి పాటుపడడమే ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.



జేఎన్టీయూలో మహిళలను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

సౌకర్యాలు నిల్.. సమస్యలు ఫుల్..!

- అధ్వానంగా సున్నం చెరువు పార్కు
- విరిగిన జిమ్ పరికరాలు
- కానరానీ మరుగుదొడ్లు
- ఇబ్బందుల్లో వాకర్స్, సందర్శకులు
- పట్టించుకోని అధికారులు





విరిగిన జిమ్ పరికరాలు, అసంపూర్తి పనులు



మోతీనగర్: గాయత్రీనగర్ సున్నం చెరువు పార్కులో సమస్యలు తిష్ట వేశాయి. ఓవైపు ఓపెన్ జిమ్‌లో పరికరాలు ధ్వంసం కాగా, మరోవైపు కనీస సౌకర్యాలు లేక వాకర్సు, సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబిహాబేగం సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే అందులోని పరికరాలు విరిగిపోవడంతో ఉదయం, సాయంత్రం వేళలో వాకింగ్‌కు వచ్చే వాకర్స్ వ్యాయమం చేయకుండానే వెళ్తున్నారు. జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధింత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పార్కు ఆవరణలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మౌలిక వసతుల పేరిట అధికారులు కొన్ని మరమ్మతులు చేపట్టినా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. సున్నం చెరువు పార్కుకు, బోరబండ, అల్లాపూర్, గాయత్రీనగర్, తులసీనగర్, వివేకానందనగర్‌తో పాటు ఇతర బస్తీవాసులు కూడా పార్కుకు వస్తుంటారు. వారి సౌకర్యార్థం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని అలాగే సౌకర్యాలు కల్పించాలని వాకర్స్, సందర్శకులు కోరుతున్నారు.

> **అధికారులు పట్టించుకోవడం లేదు..**
>
> సున్నం చెరువు పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరికరాలన్ని ధ్వంసమయ్యాయి. దీంతో వాకర్స్ వ్యాయమం చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. అధికారులు సత్వర చర్యలు తీసుకుంటే అందరికి ఉపయోగకరంగా ఉంటుంది.
>
> 
>
> –కాశీనాథ్‌చారి, మోతీనగర్



క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



జ్యోతి ప్రజల్వన చేసి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ముంబై జాతీయ రహదారిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగడాల శిరీష హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలు టీబీ లక్షణాలు తెలుసుకోలేకే వ్యాధిబారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారని, టీబీ నిర్మూలనకు ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. దగ్గు, దమ్ము వస్తే వెంటనే ముందు జాగ్రత్తగా వైద్యులను సంప్రదించి టీబీ టెస్టులు చేయించుకోవాలన్నారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ బాబురావు, నాయకులు వెంకటేష్, లలిత, శారద, పృథ్వీరాజ్, ఆసుపత్రి వైద్యులు కమలాకర్, ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు, బీఎంహెచ్ఓ ఉమాగౌరీ, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, పద్మావతి, కల్పన, మమత, మౌనిక, శ్రావణ్, శోభారాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారావు సేవలు చిరస్మరణీయం



కృష్ణారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ నారాయణ తదితరులు

కూకట్‌పల్లి: కృష్ణారావు సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని ఇతిహాస్ హోటల్‌లో లోక్‌సత్తా నాయకుడు జే. కృష్ణారావు సంతాప సభను సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణారావు అధ్యాపకుడిగా, సామాజిక స్పృహ గల లోక్‌సత్తా కార్యకర్తగా, సమాచార హక్కు చట్టంపై పోరాటంలో కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తెలు కల్యాణి, సురేందర్‌రావు, మాలతి, మాజీ కార్పొరేటర్ వెంగళరావు, లోక్‌సత్తా నాయకులు శ్రీనివాసన్, ఉపేంద్ర, నాయకులు రమణారెడ్డి, పుల్లారెడ్డి, కృష్ణభగవాన్, కట్టా నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జలమండలి అధికారులు, సిబ్బంది

మూసాపేట: నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తులో నీటి కొరత ఉండదని జలమండలి మూసాపేట సర్కిల్ డీజీఎం శివ పేర్కొన్నారు. జల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భరత్‌నగర్‌లో నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ జాకీ, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బాలానగర్‌లో కాంగ్రెస్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేశ్

బాలానగర్: బాలానగర్‌లోని స్మార్ట్ హోటల్‌లో మేడ్చల్–మల్కాజ్‌గిరి కాంగ్రెస్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ అనేది సమానత్వం, న్యాయం, భారత రాజ్యాంగం విలువలు కాపాడేందుకు కలిసి పని చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మహిళ, యూత్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేశ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ రామారావుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2, లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ సంబంధిత చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రమేశ్, శివ, రాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మూసాపేట: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న కేపీహెచ్‌బీ బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) మూర్ఛ వ్యాధితో కన్పించాడు. గమనించిన పోలీసులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈనెల 22న చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సర్వే డబ్బులు చెల్లించాలి



మూసాపేట కమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్లకు కులగణన సర్వే డబ్బులు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు శంకర్ కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి మూసాపేట కమిషనర్ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో పాల్గొన్న ఇతరులకు డబ్బులు ఇచ్చి అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్‌లో పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, టీచర్స్ సంగీత, శశికళ, వాజీదా, పుష్ప, సావిత్రి, పద్మ, చందన, కవిత, ఎం. కవిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్ విద్యార్థులకు ఉద్యోగాలు



కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్, టెక్నాలజీ మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ప్రముఖ సంస్థలో ఉద్యోగాలు లభించాయి. మెటలర్జికల్ విభాగానికి చెందిన 8 మంది విద్యార్థులు ప్రముఖ నేషనల్ రిసోర్సెస్ కంపెనీ వేదాంత లిమిటెడ్‌లో ఉద్యోగాలు పొందారు. ఎంపికైన విద్యార్థులకు రూ.11.45 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ అందుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి. నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు మెటలర్జీ విభాగాధిపతి డా.బి. రమేశ్ చంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి సురేశ్‌బాబు తదితరులు విద్యార్థులను అభినందించారు.

యూనిక్ డిసేబిలిటీపై దివ్యాంగులకు అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లాలోని దివ్యాంగులు ఇక నుంచి సదరం సర్టిఫికెట్లను పొందడానికి యూనిక్ డిసేబిలిటీ ఐడీ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని దివ్యాంగులకు యూనిక్ డిసేబిలిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) జారీ చేసే అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి యం.సాంబశివరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యూనిక్ డిసేబిలిటీ ఐడీ ప్రక్రియకు సంబంధించి వివరించారు. ఇందులో మీ–సేవ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్లు, జిల్లా జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్ల కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఏపీఓ(పింఛన్లు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

జెడ్పీ లేని జిల్లాగా..

రద్దు కానున్న మేడ్చల్–మల్కాజిగిరి జెడ్పీ

కొత్తగా మూడు మున్సిపాలిటీల ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కాబోతోంది. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా, ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాకు మాత్రమే జెడ్పీ లేదు. తాజాగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూడా జెడ్పీ లేని రెండో జిల్లాగా ఆ జాబితాలో చేరనుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కొత్తగా ఆవిర్భవించిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాలు.. 62 గ్రామ పంచాయతీలతో కొత్త జిల్లా పరిషత్(జెడ్పీ) ఏర్పాటైంది. ఈ జెడ్పీ పరిధిలో ఐదు మండలాలు మాత్రమే ఉండగా, అతి చిన్న జిల్లా పరిషత్‌గా ఐదుగురు జెడ్పీటీసీలతో పాలకవర్గం ఐదు ఏళ్లపాటు కొనసాగింది. కాంగ్రెస్ సర్కారు ఇటీవల ఐదు మండలాల పరిధిలో 64 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. తాజాగా మిగిలిన 34 గ్రామ పంచాయతీలను కూడా మూడు పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఒక తీర్మానం చేశారు. జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కావడంతో పాటు పూర్తిగా గ్రామ పంచాయతీలు లేని అర్బన్ ప్రాంతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మారబోతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు మున్సిపల్ సర్కిళ్లతో సహా 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. కొత్తగా పెరుగుతున్న మూడు పురపాలక సంఘాలతో కలిపి జిల్లాలో మొత్తంగా 16 పురపాలక సంఘాలు కానున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం కింద కొనసాగనున్న అభివృద్ధి పనులు నిలిచిపోనున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖలు కూడా మాయం కానున్నాయి.

16కు పెరిగిన పురపాలక సంఘాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం 13 పురపాలక సంఘాలు ఉండగా, తాజాగా ఏర్పడనున్న కొత్త మూడు పురపాలక సంఘాలతో కలిపితే.. మొత్తం 16 పురపాలక సంఘాలు కానున్నాయి. ఇందులో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, మేడ్చల్, తూముకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, కొంపల్లి, దుండిగల్, కొత్తవి అలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి.

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

మేడ్చల్ జిల్లాలో కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీల్లో ఎంసీ పల్లి, ఎల్లంపేట, అలియాబాద్ ఉండనున్నట్లు తెలుస్తోంది. మూడుచింతలపల్లి(ఎంసీ పల్లి)ల కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో లింగాపూర్, ఉద్దెమర్రి, కేశవరం, నాగిశెట్టిపల్లి, కొల్తూర్, నారాయణపూర్, పోతారం, అనంతారం, లక్ష్మాపూర్, అద్రాస్‌పల్లి, జగ్గంగూడ, కేశవపూర్, మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీలు విలీనం కానున్నట్లు తెలుస్తోంది. అలియాబాద్ కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో అలియాబాద్, తుక్కుపల్లి, లాల్గడి మలక్‌పేట్, మజీద్‌పూర్, మురహరిపల్లి, యాడారం, పొన్నాల గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోకి ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, నూతనకల్, మైసిరెడ్డిపల్లి, కోనాయిపల్లి, సోమారం, రావల్‌కోల్, డబిల్‌పూర, రాజ్ బొల్లారం, ఘన్‌పూర్, సైదోనిగడ్డ తండా, రాజ్ బొల్లారం తండా, లింగాపూర్ గ్రామ పంచాయతీలు రానున్నాయి.

గ్రేటర్ పరిధిలోకి 13 పురపాలికలు..?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, నాగారం, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట మున్సిపాలిటీలు విలీనం అవుతాయనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీలు మినహాయించి, మిగతా 13 పురపాలక సంఘాలు గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపేందుకే.. ఇటీవల ఏడు పురపాలక సంఘాల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలను సర్కారు ఇటీవల విలీనం చేసినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి జిల్లాలోని 13 పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసే ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రచారం సాగుతోంది.